సాక్షి వైఎస్‌ఆర్ జిల్లా

శుక్రవారం, 15, సెప్టెంబర్, 2023



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

బద్వేలు మండలం కొంగలవీడు గ్రామ సమీపాన రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో అట్లూరు మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. -II లో



ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి సీనియర్ విభాగం ఫుట్‌బాల్ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. -II లో

గరిష్టం/కనిష్టం

34.5 /25.8

వాతావరణం

జిల్లాలో గురువారం 25.8 - 34.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రూ.172 కోట్ల రుణం

కడప రూరల్ : 2023–24 ఆర్థిక సంవత్సరంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.172 కోట్ల రుణం అందించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌నాయక్ పేర్కొన్నారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో స్త్రీనిధి, సీఐఎఫ్ రుణాలపై సీసీలతో ఆయన సమీక్షించారు. పీడీ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ సభ్యుల జీవనోపాధులు మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డిసెంబర్ నాటికి నిర్దేశిత లక్ష్యాలను పూర్తిచేయాలని, వంద శాతం రికవరీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి ఏజీఎం పీ.రమణారెడ్డి, డీపీఎం హరిప్రసాద్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉద్యోగుల గ్రీవెన్స్ డే

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ఆయా డిపోల పరిధిలో శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పోలిమేరగోపాల్‌రెడ్డి తెలిపారు. కడప ఆర్టీసీ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో వైఎస్సార్ జిల్లాలోని ఆరు డిపోలలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యలపై సీఎఫ్‌ఎంఎస్ ఐడీ గుర్తింపు సంఖ్యతో ఆన్‌లైన్‌లోనూ లేదా నేరుగా వినతి పత్రాలు సమర్పించాలన్నారు.

ప్రశాంతంగా ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్, సబ్జెక్టు నిపుణులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో గురువారం నిర్వహించిన గెస్ట్ ఫ్యాకల్టీల ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయి. బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మాటిక్స్, ఫైన్‌ఆర్ట్స్, ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో నిపుణుల కమిటీ ఇంటర్వ్యూలను నిర్వహించింది. సైన్స్ విభాగం డీన్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, తిరుపతి ఎస్.వి.యూ కెమిస్ట్రీ ఆచార్యులు డా. ఎ.వి.ఎస్.రెడ్డి, ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆచార్యులు సర్దార్‌బేగ్, విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయం లలితకళల శాఖ సహాయ ఆచార్యులు డా. సింహాచలం తదితరులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ఆర్కిటెక్చర్ కోర్సుకు అనుమతి

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(బీ.ఆర్క్) కోర్సులో ప్రవేశాలు నిర్వహించుకునేందుకు కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అనుమతులు మంజూరు చేసింది. 2023–24 విద్యా సంవత్సరంలో ఐదేళ్ల ఫుల్‌టైం కోర్సులో 40 సీట్లను భర్తీ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దీనిపై విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య బి.ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

నేత్రదానం



అంబటి వేణుగోపాల్

ప్రొద్దుటూరు : కుటుంబ సభ్యుల చొరవతో మృతుడి నేత్రాలు దానం చేసి మరొకరికి కంటి చూపు దక్కే అవకాశం కల్పించారు. స్థానిక వైఎంఆర్ కాలనీకి చెందిన డాక్టర్ అంబటివేణుగోపాల్(88) గురువారం చనిపోయారు. టీటీడీ మాజీ పాలకమండలి సభ్యుడు టంగుటూరు మారుతీప్రసాద్ మృతుడి కటుంబానికి తన సంతాపం తెలిపారు. నేత్రదానం ఆవశ్యకతను కుటుంబసభ్యులకు వివరించడంతో వారు అంగీకరించారు. స్నేహ సేవా సమితి, డాక్టర్ వైవీ.లక్ష్మీదేవి నేత్రనిధి సిబ్బంది అక్కడికి చేరుకుని మృతదేహం నుంచి రెండు కార్నియాలను సేకరించి హైదరాబాద్ అగర్వాల్ ఐబ్యాంకుకు పంపారు. ప్రతి ఒక్కరు నేత్రదానం చేయాలని స్నేహ సేవా సమితి ప్రెసిడెంట్ బి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

21న సైన్స్ సెమినార్

రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి డైట్ కళాశాలలో ఈనెల 21వ తేదీన జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చిరుధాన్యాలు మంచి పోషకాహారం లేదా ఒక మంచి ఆహారం అనే అంశంపై సైన్స్ సెమినార్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాసైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రభుత్వ యజమాన్య పాఠశాలలో 8,9,10వ తరగతులు చదువుతున్న విద్యార్థులు ఇందులో పాల్గొనడానికి అర్హులన్నారు. ఒక పాఠశాల నుంచి ఒకరు మాత్రమే పాల్గొనాలన్నారు. ప్రదర్శనలో శాస్త్రీయ విషయాలు, ప్రసంగంలో పటిమ, ప్రశ్నలకు సమాధానమివ్వగల సామర్థ్యం, విజువల్స్ వాడకంలో కొత్తదనం తదితర అంశాలను పరీక్షిస్తారని తెలిపారు.

భవిత బలోపేతం



వేంపల్లెలోని భవితకేంద్రం (ఇన్‌సెట్) ఒంటిమిట్ట భవిత కేంద్రంలో చిన్నారులకు పాఠాలను బోధిస్తున్న ఐఈఆర్టీ

- దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
- భవిత కేంద్రాల్లో పోస్టుల భర్తీకి చర్యలు

కడప ఎడ్యుకేషన్ : దివ్యాంగులైన విద్యార్థులకు దివ్యమైన భవితను అదించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. వీరి కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. వారి అవసరాలను తీరుస్తోంది. వారికి అన్ని రకాల ఫిజియోథెరఫీ సేవలందించి ఆరోగ్య భరోసా కల్పిస్తోంది. దీంతోపాటు వినికిడి, దృష్టిలోపం ఉన్న చిన్నారులకు డిజిటల్ విద్య అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం గతేడాది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించింది. 1 నుంచి 10వ తరగతి చదువుతున్న దివ్యాంగ చిన్నారులకు వారి అవసరాలకు ఉపయోగపడే విధంగా కంటెంట్‌తో కూడిన ట్యాబ్స్ సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేసింది. దివ్యాంగులకు బోధన అందించేందుకు అవసరమైన పరికరాలను ఇచ్చేందుకు భవిత కేంద్రాలను ఇప్పటికే బలోపేతం చేసింది. తాజాగా భవితా కేంద్రాల్లో సిబ్బందిని భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంది. జిల్లావ్యాప్తంగా 36 భవిత కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 689 మంది పిల్లలు చదువుతున్నారు. ఈ కేంద్రాల్లో రిసోర్సుపర్సన్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ వెలువరించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన నోటిఫికేషన్‌లో భాగంగా వైఎస్సార్ జిల్లాలో ఎమ్మార్ 18, వీఐఅండ్ హెచ్‌ఐ4 పోస్టులు భర్తీ చేయనున్నారు. సమగ్ర శిక్ష అధికారులు అర్హులనుంచి దరఖాస్తులు కోరుతున్నారు.

- ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్(సహిత విద్య)లో ఖాళీగా ఉన్న మానసిక వైకల్యం(ఎంఆర్) వినికిడి, చెవిటి(వీఐ, హెచ్‌ఐ) విభాగాలకు చెందిన పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఖాళీ పోస్టుల భర్తీకి ఈ నెల 18వ తేదీ వరకు గడువు ఉంది. అర్హులు హెచ్‌టీటీపీ.ఏపీఐఈ.ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇవీ అర్హతలు..

అభ్యర్థుల వయసు 18–42 సంవత్సరాల మధ్య ఉండాలి. 2023 జూలై 31 నాటికి 42 ఏళ్లలోపు వయసు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్‌కు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వయో పరిమితి సడలింపు ఉంటుంది. సాధారణ డిగ్రీ, రీహ్యాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌సీఐ) గుర్తించిన స్పెషల్ బీఈడీ విద్యార్హత కలిగి ఉండాలి. సాధారణ డిగ్రీతోపాటు స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఏడాది డిప్లొమా కోర్సు చేసి ఉండాలి. బ్యాచిలర్ డిగ్రీతోపాటు సాధారణ బీఈడీ డిగ్రీ ఆర్‌సీఐ గుర్తింపు కలిగిన రెండేళ్ల డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ కలిగి ఉండాలి. సీడబ్ల్యూఎస్ రిపోర్టు పర్సన్‌గా ఎంపికైన వారికి నెలకు రూ. 20 వేలు గౌరవ వేతనం అందజేస్తారు. గౌరవ వేతనం పెంచడానికి, తగ్గించడానికి ప్రభుత్వానికి అధికారం ఉంటుంది. రోస్టర్ కమ్ మెరిట్ ప్రాతిపదికన నియామకాలు చేపడతారు. జిల్లా సెలెక్షన్ కమిటీ నియమ నిబంధనల మేరకు నియామకాలు జరుగుతాయి.

జిల్లాలో ఖాళీలు

మండలం	ఎంఆర్	హెచ్‌ఐ/వీఐ	మొత్తం
ఆట్లూరు	1	0	1
బికోడూరు	1	1	2
బిమఠం	1	1	2
బద్వేల్	1	0	1
చక్రాయపేట	1	0	1
గోపవరం	1	0	1
కలసపాడు	1	0	1
కొండాపురం	1	0	1
లింగాల	1	0	1
ముద్దనూరు	1	0	1
పెద్దముడియం	1	0	1
పెండ్లిమర్రి	1	0	1
పోరుమామిళ్ల	0	1	1
రాజుపాళెం	1	0	1
సింహాద్రిపురం	1	0	1
తొండూరు	1	1	1
వేముల	1	0	1
వీఎన్‌పల్లె	1	0	1

18లోగా దరఖాస్తు చేసుకోవాలి



సాధారణ విద్యార్థులతో సమానంగా దివ్యాంగులను తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోంది. భవిత కేంద్రాల పోస్టులకు అర్హత ఉండి, అసక్తి గల అభ్యర్థులు ఈ నెల 18వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.

– మిట్టా కేశవరెడ్డి, జిల్లా సహిత విద్య సమన్వయకర్త, కడప

భవిత కేంద్రాల అభివృద్ధికి చర్యలు



ప్రభుత్వం భవిత కేంద్రాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటోంది. వీటిల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టింది, ప్రభుత్వ నిర్ణయంతో భవిత కేంద్రాలు బలోపేతం కానున్నాయి, దీంతో చిన్నారుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడతాయి.

– అంబవరం ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి

డీసీసీ బ్యాంకులో ప్రభుత్వ నిధులు



డీసీసీ చైర్ పర్సన్ మల్లెల ఝాన్సీరాణిని అభినందిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కడప అగ్రికల్చర్ : కడప డీసీసీ బ్యాంకులో ప్రభుత్వ నిధులు జమ చేయాలని కలెక్టర్ విజయరామరాజు సూచించారు. డీసీసీ బ్యాంకు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీసీసీ బ్యాంకు ప్రగతి మరింత మెరుగు పరిచేందుకు ఒక సెంటర్‌ను దత్తత తీసుకోవాలని కోరారు. డీసీసీ బ్యాంకు చైర్ పర్సన్ మల్లెల ఝాన్సీరాణి మాట్లాడుతూ మెండి బకాయిల వసూలుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కడప డీసీసీ బ్యాంకు జాతీయస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపినందుకు చైర్ పర్సన్, సీఈవో కందుల రాజేంద్రకుమార్, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈ సమావేశంలో ఆప్‌కాబ్ డీపీడీఎం వీరశంకర్, నాబార్డు డీడీఎం విజయవిహారి, ఎల్‌డీఎం దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

డబ్బు వసూలు చేస్తే చర్యలు

కడప రూరల్ : డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా రోగి ఓపీలో చూపించుకుని ఇంటికి వెళ్లేంత వరకు ఎవరైనా డబ్బు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ప్రత్యేక అధికారి అశోక్‌బాబు పేర్కొన్నారు. స్థానిక డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలోని భవనంలో సిబ్బందితో ఆయన సమీక్షించారు. అశోక్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం 3,255 వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చిందన్నారు.ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే 53 వేల పోస్టులను భర్తీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ బాలాంజనేయులు, ఆరోగ్య మిత్రలు పాల్గొన్నారు.

కురులు.. కురిపించె సిరులు



- సంతాన దేవతకు తలనీలాలే ఆస్తి
- రెడ్డెమ్మ కొండ నుంచి
- విదేశాల్లో భలే డిమాండ్
- రికార్డు స్థాయిలో వేలం పాట



చెర్లోపల్లెలో వెలసిన సంతానదేవత శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం, తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

కడప డెస్క్ : తల నీలాలు అనగానే తిరుమల కల్యాణ కట్ట గుర్తుకు వస్తుంది. తిరుమల వెళ్లిన భక్తుల్లో పిల్లలు, పెద్దలు, వృద్ధులు.. ఇలా దాదాపు 80 శాతం మంది తలనీలాలు సమర్పిస్తారు. తిరుమల తర్వాత తలనీలాలకు అంత ప్రాధాన్యం గల ఆలయం అన్నమయ్య జిల్లాలోని రెడ్డెమ్మకొండ. ఇక్కడ యువత... అదీ ఎక్కువగా వివాహితలు తమ తల నీలాలు సమర్పిస్తారు. సంతాన దేవతగా ప్రసిద్ధి పొందిన ఈ అమ్మవారికి వివాహితలు తమ తలనీలాలు సమర్పించి దర్శించుకుంటే సంతాన ప్రాప్తి కలుగుతుందని నమ్మకం. అలాగే తమ కోరిక తీరిన తర్వాత కూడా తలనీలాలు సమర్పిస్తారు.

సంతాన దేవతగా ప్రసిద్ధి

అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం చెర్లోపల్లి గ్రామంలో రెడ్డెమ్మకొండ ఆలయం ఉంది. రాయచోటి–మదనపల్లి జాతీయ రహదారిలోని పెద్దాలవారి పల్లి వద్ద దిగి కిలోమీటరు వెళ్తే ఈ ప్రసిద్ధ ఆలయం కనిపిస్తుంది. రాష్ట్రంలో ఇతర దేవాలయాలతో పోల్చితే రెడ్డెమ్మ కొండ ఆలయానికి ప్రత్యేకత ఉంది. ఇక్కడికి వచ్చే భక్తులలో సంతానం కోసం వచ్చే వారే అధికం. పైగా అందరూ 45 సంవత్సరాల వయస్సు లోపు మహిళలే. ఇక్కడి ఆలయ పరిసరాల్లో తల నీలాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకుంటే సంతానం కలుగుతుందని వారి నమ్మకం. అందుకే భారీ సంఖ్యలో వివాహితలు వచ్చి దర్శించుకుని ఇక్కడ పంపిణీ చేసే ఆకు పసరు తాగి అమ్మవారి ఎదుట సాష్టాంగ నమస్కారం చేస్తారు. తమ కోర్కెలు తీరిన తర్వాత మహిళలతో పాటు వారి కుటుంబ సభ్యులు అమ్మవారికి తలనీలాలు సమర్పిస్తుంటారు.

తలనీలాలకు చైనాలో డిమాండ్

రెడ్డెమ్మ ఆలయానికి వచ్చే వారిలో యుక్త వయస్సు వారే అధికం. వీరు సమర్పించే తలనీలాలు ఎంతో నాణ్యమైనవిగా ఉండడంతో విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి నుంచి చైనాతోపాటు ఇతర దేశాలకు తలానీలాలను ఎగుమతి చేస్తుంటారు. రాష్ట్ర స్థాయిలో రెడ్డెమ్మతల్లి ఆలయంలో భక్తులు సమర్పించే ఈ తలనీలాలకు మొదటి స్థానం ఉంది. విదేశాల్లోనూ ఎక్కువ ధర లభించడమే కారణం.

కిలో తలనీలాలు రూ. 60 వేలు

ప్రస్తుతం కిలో తలనీలాల ధర మార్కెట్లో రూ. 60 వేల వరకు పలుకుతోంది. గతంలో కిలో ధర రూ. 30 వేల నుంచి రూ. 40వేల వరకు మాత్రమే ఉండేది. అయితే మార్కెట్లో ఉన్న డిమాండ్ దృష్ట్యా విదేశాల్లోనూ ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి.

రికార్డుస్థాయిలో వేలం పాట

నాణ్యమైన తలనీలాల కోసం పోటీ పెరగడంతో ఆలయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది తలనీలాల వేలం పాట రికార్డు సృష్టించింది. కర్ణాటక తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలతోపాటు రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, కర్నూలు, అనంతపురం, కృష్ణా జిల్లాల నుంచి పెద్దఎత్తున వ్యాపారులు తరలి రావడంతో పోటీ పెరిగింది. వేలం దక్కించుకోవాలనే ఉద్దేశంతో రికార్డు స్థాయిలో రూ.27.01 లక్షలకు వరకు పాడుకున్నారు. గతంలో రూ. 10 నుంచి రూ. 12 లక్షలు దక్కగా రెండేళ్లలో అమాంతం పెరిగి గత ఏడాది రూ.26.34 లక్షలు, ప్రస్తుతం రూ.27.01 లక్షలకు పాట ముగియడం విశేషం. విదేశాల్లో రెడ్డెమ్మకొండ తలనీలాలకు ఉన్న డిమాండే దీనికి కారణమని వ్యాపారులు చర్చించుకోవడం గమనార్హం.

తలనీలాలకు మంచి డిమాండ్



అమ్మవారి ఆలయంలో భక్తులు సమర్పించే తలనీలాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. నాలుగు రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు పాల్గొనడం ఇందుకు నిదర్శనం. దేశంలోనేగాక, విదేశాల్లోనూ రెడ్డెమ్మకొండ తలనీలాలకు మంచి డిమాండ్ ఉంది. అందుకోసమే వ్యాపారులు పెద్ద మొత్తంలో దక్కించుకున్నారు.

– నరసింహారెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్, చెర్లోపల్లి

అధిక మొత్తంలో పాడుకొన్నారు



ఈ ఏడాది తలనీలాలకు ఎక్కువ మొత్తంలో వేలంపాట పాడుకొన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా వ్యాపారులు పోటీపడి వేలంలో పాల్గొన్నారు. అమ్మవారి దయతో రికార్డు స్థాయిలో రూ. 27.01 లక్షలకు తలనీలాల కాంట్రాక్టు తీసుకొన్నారు. ఆలయ అభివృద్ధికి ఇది దోహద పడుతుంది.

– మంజుల, శ్రీరెడ్డెమ్మకొండ ఈవో, చెర్లోపల్లి

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI / SAKSHI DIGITAL / MEDIA GROUP — ఆంధ్రప్రదేశ్ ANDHRA PRADESH AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

పవన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్,
గవర్నమెంట్ ఐ.టి.ఐ ఎదురుగా,
అక్కాయపల్లి, కడప.

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 97059 07418

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ : శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని ఈనెల 28న అరుణాచలంకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. 28 ఉదయం 9 గంటలకు ఆరు బస్సులు బయలుదేరుతాయన్నారు. ప్రయాణికులు ముందుగా టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకోవాలని ఆయన చెప్పారు. మరిన్ని వివరాలకు 9959225677, 9160186645ను సంప్రదించాలన్నారు.

ఇక 20 నిమిషాల్లో రిజిస్ట్రేషన్

- కార్డు ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌తో మ్యుటేషన్
- నేటి నుంచి ఉమ్మడి జిల్లాలో అమలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో ఇక భూములు అమ్మాలన్నా.. కొనాలన్నా... రిజిస్ట్రార్ కార్యాలయంలో గంటల కొద్దీ వేచి చూడాల్సిన అవసరం లేదు. 20 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ అయిపోతుంది. రిజిస్ట్రేషన్ల కోసం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం కొత్త ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా మొత్తం ప్రక్రియ ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. ఇందుకు కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్ విధానాన్ని ప్రవేశపెట్టింది. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పారదర్శకత పెంచడమే దీని లక్ష్యం. స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్ల శాఖలో 24 ఏళ్లుగా ప్రభుత్వం కార్డ్ 1.0 సాఫ్ట్‌వేర్‌తో స్థిరాస్తుల క్రయ, విక్రయాలు రిజిస్ట్రేషన్ చేస్తూ వస్తోంది. అయతే తాజాగా వినియోగదారులకు ఖర్చు తగ్గించేందుకు కార్డ్‌ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చింది. స్థిరాస్తి కొనుగోలుదారులే తమ డాక్యుమెంట్లు రూపొందించుకునే నూతన విధానాన్ని తీసుకువచ్చి రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభం చేసింది. ఎంచుకున్న సమయం నుంచి దాదాపు 20 నిమిషాల వ్యవధిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు. ఈ విధానంతో రిజిస్ట్రేషన్ మరింత పారదర్శకం కానుంది.

ఆటోమేటిగ్‌గా మ్యుటేషన్

ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధానంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవగానే వెంటనే మ్యుటేషన్ జరిగేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకునే విధానం ఈ సాఫ్ట్‌వేర్‌లో ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ భూములు కొనుగోలు చేసుకుని వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. కార్డ్‌ప్రైమ్ 2.0 ప్రకారం రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక 40 రోజుల్లోపు భూమి కొనుగోలుదారుకు పాసు పుస్తకాలు మంజూరుచేస్తారు. ఈ విధానంలో డాక్యుమెంట్లు వెంటనే రెవెన్యూ అధికారుల లాగిన్‌కు వెళతాయి. వారు అక్కడ నిర్ణీత సమయంలోగా ఆమోదించాల్సి ఉంటుంది. అనంతరం పది రోజుల్లో 1బీ, అడంగల్‌లో కొత్తగా భూమి కొనుగోలు చేసిన వ్యక్తి పేరు రావడంతో పాటు నూతన పట్టాదారు పాసు పుస్తకాలు నేరుగా ఇంటికే వస్తాయి. ఈ విధానాన్ని ఈ నెల 15 నుంచి ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా అమలులోకి రానుంది. ఈ విధానంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నిమ్మనపల్లె : బాహుదా పరీవాహక ప్రాంతం నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ పేర్కొన్నారు. ట్రాక్టర్ యజమాని సురేష్, డ్రైవర్ శేఖర్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బస్సు, స్కూటీ ఢీకొని ఒకరి మృతి

రాజంపేట : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లో గురువారం పులివెందుల డిపోకు చెందిన బస్సు, స్కూటీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో స్కూటీపై ఉన్న సమీరుద్దీన్ (65) మృతి చెందగా, శ్రీకాంత్ తీవ్రంగాగా పడ్డారు. శ్రీకాంత్ రాజంపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట.. అందాల మూట


ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట సొగసు చూడతరమా..


వేసెయ్ వల..

జల జల పారుతున్న జలం.. అందులో ఈత కొడుతున్న చేపలు.. వాటిని పట్టుకోవడానికి వల వేస్తున్న మత్స్యకారులు.. ఇలాంటి సుందర దృశ్యాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో.. ఆదినిమ్మాయపల్లెకు భారీగా వరదనీరు వస్తోంది. ఆనకట్ట అలుగు పారుతోంది. వెరసి అక్కడ మత్స్యకారుల సందడి నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప


మత్స్య వయ్యారం


పడింది.. చేప


అక్కడే కటింగ్.. విక్రయం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం


మృతి చెందిన రామ్‌కుమార్


పెంచలయ్య


తీవ్రంగా గాయపడిన మల్లేష్


పోలీసులు అదుపులోకి తీసుకున్న లారీ

ఒకరికి తీవ్ర గాయాలు

అట్లూరు : బద్వేలు మండలం కొంగలవీడు గ్రామ సమీపాన గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అట్లూరు మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందగా, మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అట్లూరు మండలం గాండ్లపల్లె గ్రామానికి చెందిన రామ్‌కుమార్ (50), పెంచలయ్య (42), నల్లగొండుగారిపల్లె కాలనీకి చెందిన మల్లేష్ ముగ్గురూ కలసి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా.. బద్వేలు నుంచి మరో ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి ఢీకొనడంతో రామ్‌కుమార్, పెంచలయ్య, మల్లేష్‌లు కింద పడిపోయారు. అదే సమయంలో బద్వేలు నుంచి కడపకు వెళుతున్న గుర్తు తెలియని లారీ రామ్‌కుమార్, పెంచలయ్యపైకి ఎక్కడంతో వారిరువురు అక్కడికక్కడే మృతి చెందారు. మల్లేష్ తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో తీవ్ర గాయాలపాలైన మల్లేష్‌ను బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బద్వేలు అర్బన్, రూరల్, అట్లూరు పోలీసులు అప్రమత్తమై అట్లూరు పోలీసుస్టేషన్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించి, వారిపై ఎక్కి వెళ్లిన లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అయితే మొదటగా ఢీకొట్టిన ద్విచక్ర వాహనం ఎవరిదనే విషయమై పోలీసులు ఆరా తీస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న యానాదయ్య కుటుంబ సభ్యులు

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని టీటీడీ బోర్డు సభ్యుడు ఎస్.యానాదయ్యతోపాటు కుటుంబ సభ్యులు కలిశారు. గురువారం వారు తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి ముఖ్యమంత్రికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యానాదయ్య మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో తొలిసారి నాయీ బ్రాహ్మణులకు టీటీడీ పాలక మండలి సభ్యులుగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని తెలిపారు.

'ఆరోగ్య సురక్ష'ను విజయవంతం చేయాలి


జగనన్న సురక్ష కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం నాయకులు

కడప కార్పొరేషన్ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం నాయకులు కృషి చేయాలని ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఐఎంఏ హాలులో వైఎస్సార్ జిల్లా వైద్య విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ శివానాయక్ ఆధ్వర్యంలో వైఎస్సార్, కర్నూలు, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, నంద్యాల, సత్యసాయి జిల్లాల జోనల్ ఇన్‌చార్జిలు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతోమంది ప్రాణాలు కాపాడి ప్రాణదాతగా నిలిచారన్నారు. ప్రస్తుతం ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఏవైనా సమస్యలు ఉంటే అందుకు సంబంధించిన మందులను ఉచితంగా అందజేస్తున్నారన్నారు. ఆశాలు, ఏఎన్ఎంలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నారన్నారు. ఇందులో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం సభ్యులు కూడా కీలకపాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్కాస్ డైరెక్టర్ డాక్టర్ కల్యాణ చక్రవర్తి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్, వారణాసి ప్రతాప్‌రెడ్డి, డాక్టర్‌సొహైల్ అహ్మద్, పవన్ పాల్గొన్నారు.

గాయపడిన వృద్ధురాలి మృతి

ముద్దనూరు : మండల పరిధిలోని ఆకుతోటపల్లె గ్రామంలో ఈ నెల 12న బైక్ ఎక్కుతూ కిందపడి గాయపడిన ఎక్కలూరు నారాయణమ్మ(57) చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరు ఎర్రన్నకొట్టాలకు చెందిన నారాయణమ్మ ఆకుతోటపల్లెలోని తన కూతురు ఇంటికి వచ్చింది. తిరిగి ఈనెల 12వ తేదీన సాయంత్రం ప్రొద్దుటూరుకు వెళ్లడానికి మోటార్‌బైక్ మీద కూర్చుంటుండగా అకస్మాత్తుగా జారి పడింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం కడపకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. కర్నూలులో చికిత్స పొందుతూ నారాయణమ్మ మృతి చెందింది. గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ ఓబులేసు తెలిపారు.

అవ్వ కష్టం తీరింది.. ఇంటికి చేరింది

సాక్షి ఎఫెక్ట్..


సోమల మండలం ఆవులపల్లెలో నవ్వుతున్న వెంకటలక్షమ్మ

కురబలకోట : ఎట్టకేలకు అవ్వ కష్టం తీరింది.. ఇంటికి చేరింది. 'ఆ అవ్వే మరణిస్తే.. ఆ పాపం ఎవ్వరిది..!' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో గురువారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనాన్ని చూసిన కుటుంబ సభ్యులు ఆమెను ఇంటికి తీసుకెళ్లారు. ఈమె పేరు వెంకటలక్ష్మమ్మ. సోమల మండలంలోని ఆవులపల్లె. వీరిది వ్యవసాయ కుటుంబం. ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈమె పద్మావతమ్మ అనే పెద్ద కుమార్తె వద్ద ఉంటోంది. చేతిపై ఉన్న అలివేలమ్మ అనే పచ్చబొట్టు ఈమె అక్క పేరు. అక్కపై ఇష్టంతో ఆమె పేరును వేయించుకుంది. వయసులో ఉన్నప్పుడు కుటుంబం కోసం ఎంతగానో కాయకష్టం చేసింది. నా ఇల్లు, నా వాళ్లని కుటుంబాన్ని నెత్తిన పెట్టుకుని మోసింది. ఇలాంటి ఆమె రాయచోటిలో ఉన్న చిన్న కుమార్తె వద్దకు బయలుదేరింది. సోమలలో రాయచోటి బస్సు ఎక్కాల్సి ఉంది. బస్సుపై ఉన్న పేరు గుర్తుపట్టలేదు. ఎవరినైనా అడగడానికి నోటి మాట సరిగా రాదు. దీంతో పొరపాటున కలకడ బస్సు ఎక్కింది. ఆ బస్సు కలకడ వరకే లాస్ట్ స్టాఫ్ కావడంతో.. బస్సు దిగి అక్కడ నుంచి ఎటు వెళ్లాలో తెలియక నడక ప్రయాణం చేయసాగింది. పది రోజులుగా కష్టాలు అనుభవించింది. ఈమె దీన పరిస్థితిని చూసి స్థానికులు ఓదార్చారు. ఆహారం ఇచ్చి ఆదుకున్నారు. ఈమె ఫొటోతో గురువారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఆమెను గుర్తుపట్టిన కుటుంబ సభ్యులు వచ్చి తీసుకెళ్లారు. ఎట్టకేలకు ఇంటికి చేరడంతో ఆమెకు సాంత్వన లభించింది. బతుకు జీవుడా అంటూ ఊపిరి పీల్చుకుంది. ఇన్నాళ్లు పడ్డ కష్టాన్ని మరిచింది. ఈమె కోసం కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు వివిధ చోట్ల వెతికారు. తప్పిపోయిన అమ్మ ఎట్టకేలకు దొరకడంతో.. కుమార్తెలు, కుమారులు, బంధుమిత్రులు ఆనందం వ్యక్తం చేశారు.

అన్నమయ్య డీఎఫ్ఓ వివేక్‌పై దాడి అమానుషం


మాట్లాడుతున్న ఏపీ అటవీశాఖ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోయేషన్ నాయకులు

కడప అర్బన్ : అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్‌పై కొంత మంది దాడి చేయడాన్ని ఏపీ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ కడప యూనిట్ వారు తీవ్రంగా ఖండించారు. గురువారం కడపలోని పంచవటి ఫారెస్ట్ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ టి. నాగరాజు, సెక్రటరీ ఎస్.శ్రీనివాసులు మాట్లాడారు. సానిపాయ అటవీ రేంజ్ పరిధిలో కొంత మంది అటవీ భూమి కోసం అటవీశాఖకు దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ యాక్ట్ 2006 ప్రకారం ఎవరైతే 2005వ సంవత్సరం డిసెంబర్ నెల 13 తేదీ కంటే ముందు సదరు అటవీ భూమిని సాగు చేసుకుంటున్నారో అలాంటి స్థానిక గిరిజనులు మాత్రమే అటవీ భూమి హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ విధంగా దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను గ్రామసభ కమిటీ పరిశీలించి సాక్షాలతో విచారించి సంబంధిత సిఫార్సులను సబ్ డివిజనల్ కమిటీకి పంపిస్తారన్నారు. ఈ సబ్ డివిజనల్ లెవెల్ కమిటీలో ఆర్డీఓ స్థాయి అధికారి చైర్‌పర్సన్‌గా వుంటారని తెలిపారు. తరువాత దశల వారీగా జిల్లా అటవీశాఖ అధికారి పరిశీలిస్తారని పేర్కొన్నారు. తరువాత సబ్ డివిజనల్ కమిటీ సిఫారసుల మేరకు దరఖాస్తుదారులకు భూమి అనుభవించుకోవడానికి హక్కు వుంటుందన్నారు. అయితే సానిపాయి రేంజ్‌లో దరఖాస్తు చేసుకున్న వారు నిజమైన దరఖాస్తుదారులు కారనీ గుర్తించిన జిల్లా స్థాయి కమిటీ కలెక్టర్ ఆధ్వర్యంలో దరఖాస్తులను తిరస్కరించారన్నారు. అయితే అన్నమయ్య జిల్లా మీటింగ్ హాల్‌కు హాజరైన డీఎఫ్ఓ వివేక్‌పై శంకర్‌నాయక్, విశ్వనాథనాయక్ కొందరు మహిళలు, దరఖాస్తుదారులతో దాడి చేయించారన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌లు రాజు, ఎస్.రాజశేఖర్ రాజు, జాయింట్ సెక్రటరీ ఎస్.భాను, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.భాష, ట్రెజరర్ ఏ.విశ్వనాథ్ పాల్గొన్నారు.

జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక


క్రీడాకారులతో మాట్లాడుతున్న జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి సీనియర్ విభాగం ఫుట్‌బాల్ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ ఎంపికలకు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.థామస్, కార్యదర్శి ఎం.సుధీర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈ నెల 16వ తేదీన సత్యసాయి జిల్లా కదిరిలో నిర్వహించే జోనల్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించి జిల్లా జట్లను ప్రకటించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ కోచ్ హరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు : కె.సి.మైఖెల్ జాన్సన్, వై.సునీల్‌కుమార్, సి.హెచ్.వరకుమార్, బి.రంగస్వామి, ఎస్.ముక్తియార్, ఎస్.కె.గైబు, బి.సునీత్, బి.జె.వెస్లీ, పరమేష్, కె.సంజు, జె.బన్నీ, ఎస్.బాషా, ఎం.రాఘవేంద్ర, వి.జె.బ్రెట్లీ, కె.హరీష్, ఎస్.కె.మహమ్మద్, ఎస్.బాలాజీ, వై.కృష్ణ, బి.పూజిత్, ప్రకాష్, సి.వెంకటశివ, వి.సలీంరాజు.

ట్యాంకర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

త్రుటిలో తప్పిన ప్రమాదం


దెబ్బతిన్న బస్సు ముందు భాగం

గోపవరం : మండలంలోని పి.పి.కుంట సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారి (ఎన్‌హెచ్-67)పై గురువారం తెల్లవారుజామున ముందు వెళుతున్న ట్యాంకర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. త్రుటిలో ప్రమాదం తప్పింది. బెంగుళూరు నుంచి పామూరుకు వెళుతున్న ఉదయగిరి డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు.. ముందు వెళుతున్న ఆయిల్ ట్యాంకర్ సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుకనే వెళుతున్న బస్సు ఆయిల్ ట్యాంకర్‌ను ఒక్కసారిగా ఢీకొట్టింది. దీంతో బస్సు ముందుభాగం దెబ్బతింది. ట్యాంకర్ వెనుకభాగం కూడా నుజ్జునుజ్జు అయింది. బస్సుడ్రైవర్ వెనుక సీటులో ఉన్న ఇద్దరు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. మిగిలిన ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సులో ఉన్న ప్రయాణికులను మరో బస్సు ద్వారా గమ్యస్థానం చేర్చారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ కడుపులో కణితి తొలగింపు


ఆపరేషన్ నిర్వహిస్తున్న వైద్యుల బృందం

మదనపల్లె : ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో మహిళ కడుపులో ఉన్న ఐదు కిలోల కణితిని తొలగించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవి గురువారం మీడియాకు వివరాలు వెల్లడించారు. పీటీఎం మండలం పోతుపేట పంచాయతీ పిడిమివారిపల్లెకు చెందిన వ్యవసాయ కూలీ మధు భార్య అనిత(33) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేది. కడుపు పరిమాణం రోజురోజుకు పెరుగుతుండటంతో మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించింది. అక్కడి వైద్యులు కడుపులో కణితి ఉందని, ఆపరేషన్ చేసి తొలగించాలని రూ.50 వేల వరకు ఖర్చవుతుందని చెప్పారు. అంత ఆర్థిక భారం మోయలేమని భావించిన వారు వారం క్రితం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు ఆమెకు పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ హరగోపాల్, రామాంజులునాయక్, అనస్థీషియన్ వైద్యులు కిరణ్మయి, అభిషేక్, రమేష్ తదితరులు బృందంగా ఏర్పడి ఆమెకు ఆపరేషన్ చేసి 5 కిలోల కణితిని తొలగించారు.

సాక్షి ఫ్యామిలీ
ఫ్యాషన్
వైఎస్ఆర్ జిల్లా
శుక్రవారం ॥ 15-9-2023







విలేజ్ అండ్ వింటేజ్ స్టైల్‌ని ఇప్పుడు యూత్ ఫాలో అవుతోంది.
ఫోక్ సాంగ్స్‌ని ఆనందించినట్టే
ఫోక్ డ్రెస్సింగ్‌తో ఆకట్టుకోవాలనుకుంటున్నారు.
ట్రెండ్‌ను ఫాలో అవ్వద్దు, ట్రెండ్ సెట్టర్‌గా ఉండాలి అనే ట్యాగ్‌తో
కొంత వెస్టన్ టచ్‌ని జత చేసి మరీ మెరిసిపోతున్నారు.
ఈ గణపతి నవరాత్రులకు మనదైన కళతో
వెలిగి పోవాలనుకునేవారికి ఈ స్టైల్ సరైన ఎంపిక అవుతుంది.

విలేజ్ అండ్ వింటేజ్ స్టైల్

ధోతీ ప్యాంట్స్‌లో ఎన్నో మోడల్స్ వచ్చాయి. ఇవి అబ్బాయిల కోసమే అనేది పాత మాట. ప్రాచీన జానపద మూలాంశాలతో మనదైన సంప్రదాయ కళతో రూపొందింది ఈ స్టైల్. టులిప్ ప్యాంట్‌గా టర్న్ అయిన ఈ స్టైల్ ఈ నవరాత్రి వేడుకలలో హైలైట్ కానుంది. హెవీ ఎంబ్రాయిడరీ, పాట్లీ, షెల్ లేస్ ఉన్న ఫ్లెయిరీ కేడియా టాప్ నవరాత్రి ఉత్సవంలో రాక్ అండ్ రోల్ చేయడానికి పర్ఫెక్ట్ అవుట్ ఫిట్. ఇవి విదేశాలలోనూ చాలా ప్రాచుర్యం పొందాయి. చందేరీ, మధుబని, బ్లాక్ ప్రింట్‌లతో కలిపి ఈ ప్రత్యేకమైన దుస్తులను సిద్ధం చేస్తున్నారు డిజైనర్లు.



షర్ట్ అండ్ స్కర్ట్

ప్రింటెడ్ స్కర్ట్ లేదా పలాజో స్కర్ట్, కాలర్ నెక్ షర్ట్ సౌకర్యంగానూ ఉంటుంది. విలేజ్ స్టైల్‌కి వెస్టన్ టచ్ ఇచ్చినా సంప్రదాయ లుక్‌తో ఆకట్టుకుంటుంది. ట్రైబల్ జ్యువెలరీ ధరిస్తే చాలు న్యూ లుక్‌తో మెరిసిపోతారు.

చెక్స్ శారీస్..

సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా మనదైన సంస్కృతిని ప్రతిబింబించేది చీరకట్టు. మామూలు రోజుల్లో ఎలా ఉన్నా, పండగలు, ప్రత్యేక రోజుల్లో మాత్రం చీర ధరించడం ఇప్పటికీ చూస్తుంటాం. అయితే.. వింటేజ్, విలేజ్‌తో పాటు ఫోక్ స్టైల్ కూడా కట్టులో తీసుకురావాలంటే మాత్రం చెక్స్ కాటన్ శారీ, సిల్వర్ జ్యువెలరీ మంచి ఎంపిక అవుతుంది.





మనవైన హ్యాండ్లూమ్స్

ఇక్కత్, బ్లాక్ ప్రింట్ అనార్కలీ, అంగరఖా, లాంగ్ గౌన్లు విలేజ్ స్టైల్‌లో ఆకట్టుకుంటాయి. ఘాగ్రా లేదా ఏదైనా పట్టు లెహంగా వంటివి ధరించినప్పుడు పటోలా దుపట్టాలు వేసుకుంటే విలేజ్ స్టైల్‌కి దగ్గరగా ఉన్నట్టే కాదు ప్రత్యేకంగానూ కనిపిస్తారు.



వినాయకుడికి వెరైటీ స్వీట్లు

ఈసారి వినాయకుడికి ఎంతో ఇష్టమైన ఉండ్రాళ్లు, ఇతర నైవేద్యాలతోపాటు... వైవిధ్యభరితమైన మరెన్నో స్వీట్లను తినిపించి ప్రసన్నం చేసుకుందాం....

వంటిల్లు



పనస పారోలి

కావలసినవి: బియ్యం – కప్పు; పనసపండు తురుము – ఒకటిన్నర కప్పులు (తొనలను సన్నగా తురమాలి); పచ్చికొబ్బరి తురుము – పావు కప్పు; అరటి ఆకులు – పాత్రోలీకి సరిపడా.
స్టఫింగ్ కోసం: పచ్చికొబ్బరి తురుము – కప్పు; బెల్లం – ముప్పావు కప్పు; యాలుకలుపొడి – అరటీస్పూను.

తయారీ: ● బియ్యాన్ని కడిగి రెండు గంటలపాటు నానబెట్టుకోవాలి ● మందపాటి బాణలిలో బెల్లం, నాలుగు టేబుల్ స్పూన్ల నీళ్లు పోసి వేసి మరిగించాలి ● బెల్లం కరిగి నురగలాంటి బుడగలు వస్తున్నప్పుడు పచ్చికొబ్బరి తురుము వేయాలి ● పాకంలో గరిట పెట్టి కలియతిప్పుతూ మిశ్రమం దగ్గర పడేంత వరకు మగ్గనివ్వాలి ● నీరంతా ఇంకిపోయినప్పుడు అర టీస్పూను యాలకుల పొడి కలిపి చల్లారనివ్వాలి ● ఇప్పుడు నానిన బియ్యంలో నీళ్లు తీసేసి బ్లెండర్‌లో వేయాలి ● దీనిలోనే పనసపండు తురుము, కొబ్బరి తురుము వేసి మెత్తని పేస్టులా గ్రైండ్ చేయాలి ● గ్రైండ్ అయిన మిశ్రమాన్ని గిన్నెలో తీసుకోవాలి ● ఇప్పుడు అరటి ఆకులను శుభ్రంగా కడిగి, తడిలేకుండా తుడుచుకోవాలి ● రుబ్బుకున్న బియ్యం పేస్టుని అరటి ఆకులపైన మందపాటి పొరలాగా వేసుకోవాలి. పొర మరీ మందంగా, మరీ పలుచగా కాకుండా మీడియంగా ఉండాలి ● చల్లారిన బెల్లం కొబ్బరి తురుముని పొరపైన మధ్యలో వేయాలి ● ఇప్పుడు అరటి ఆకుని నిలువుగా మడిచి ఆవిరి పాత్రలో పెట్టుకోవాలి ● ఈ ఆకులను ముప్పై నిమిషాలపాటు ఆవిరిమీద ఉడికిస్తే పనస పాత్రోలీ రెడీ.



బనానా మోదక్

కావలసినవి: గోధుమ పిండి – కప్పు; అరటిపండ్లు – రెండు; బెల్లం – ముప్పావు కప్పు; పచ్చికొబ్బరి తురుము – టేబుల్ స్పూను; అటుకులు – రెండు టేబుల్ స్పూన్లు; సూజీ రవ్వ – రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు – చిటికెడు; నెయ్యి – రెండు టేబుల్ స్పూన్లు; యాలకుల పొడి – పావు టీస్పూను; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● అరటిపండ్లు, బెల్లం, కొబ్బరి తురుము, అటుకులు, సూజీరవ్వను మిక్సీజార్‌లో వేసి కొద్దిగా నీళ్లుపోసి పేస్టులా గ్రైండ్ చేయాలి ● ఈ పేస్టుని పెద్దగిన్నెలో వేసి... గోధుమ పిండి, ఉప్పు, నెయ్యి, యాలకుల పొడి అన్ని కలిసిపోయేలా చక్కగా కలపాలి ● ఇప్పుడు ఈ పిండిని మోదక్‌లా లేదా నచ్చిన ఆకారంలో చేసుకుని మరుగుతోన్న నూనెలో వేసి డీప్ ఫ్రైచేయాలి ● మీడియం మంట మీద రెండు వైపులా గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు ఫ్రై చేస్తే బనానా మోదక్ రెడీ.



పతి శప్త

కావలసినవి: మైదా – అరకప్పు; సూజీ రవ్వ – నాలుగు టేబుల్ స్పూన్లు; బియ్యప్పిండి – రెండు టేబుల్ స్పూన్లు; పంచదార పొడి – టేబుల్ స్పూను; వంటసోడా – పావు టీస్పూను; పాలు – కప్పు; నెయ్యి – నాలుగు టేబుల్ స్పూన్లు.
స్టఫింగ్ కోసం: కోవా – కప్పు; ఎండుకొబ్బరి పొడి – ముప్పావు కప్పు; పంచదార పొడి – అర కప్పు; జీడిపప్పు – పది (సన్నగా తరగాలి); యాలకుల పొడి – అరటీస్పూను.

తయారీ: ● పెద్దగిన్నెలో సూజీ రవ్వ, బియ్యప్పిండి, వంటసోడా టేబుల్ స్పూను పంచదార పొడి, పాలు వేసి దోశ బ్యాటర్‌లా కలుపుకోని అరగంట నానబెట్టుకోవాలి ● బాణలిలో కోవా వేసి సన్నని మంట మీద వేయించాలి ● రంగు మారి మంచి వాసన వస్తున్నప్పుడు మంట ఆపేసి కొబ్బరి, పంచదార, యాలకులపొడి, జీడిపప్పు తరుగు వేసి కలపాలి ● ఇప్పుడు వేడెక్కిన పెనంపై కలిపి పెట్టుకున్న బ్యాటర్‌ను టేబుల్ స్పూను వేసి పలుచని చిన్న అట్టులా పోసుకోవాలి. దీనిచుట్టూ నెయ్యివేసి రెండు వైపులా బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు కాల్చాలి ● చక్కగా కాలిన అట్టు మధ్యలో కోవా మిశ్రమం వేసి రోల్‌లా చుట్టి పక్కన పెట్టుకోవాలి ● ఇలా బ్యాటర్ మొత్తాన్నీ రోల్స్‌లా చేసుకుంటే పతిశప్త రెడీ.



సేమియా లడ్డు

కావలసినవి: వేయించిన సేమియా – కప్పు; కోవా – అరకప్పు; పంచదార – ఐదు టేబుల్ స్పూన్లు; రోజ్‌వాటర్ – టీస్పూను; బాదం పలుకులు – మూడు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● బాణలిలో పంచదార వేసి సన్నని మంటమీద కరగనివ్వాలి ● పంచదార కరుగుతున్నప్పుడే కోవా వేసి తిప్పాలి ● పంచదార కరిగి మిశ్రమం దగ్గర పడినప్పుడు సేమియా, బాదం పలుకులు వేసి కలపాలి ● అన్ని చక్కగా కలిసిన తరువాత రోజ్‌వాటర్ వేసి మరోసారి కలిపి స్టవ్ మీద నుంచి దించేయాలి ● ఇప్పుడు మిశ్రమాన్ని లడ్డుల్లా చుట్టుకుంటే వర్మిసెల్లి లడ్డు రెడీ.



స్వీట్ సందేశ్

కావలసినవి: ఉడికించిన చిలగడ దుంప – పెద్దది ఒకటి; పచ్చికొబ్బరి తురుము – ముప్పావు కప్పు; జీడిపప్పు పొడి – పావు కప్పు; కొబ్బరి పాలు – అరకప్పు; పంచదార – అరకప్పు; యాలకులపొడి – అరటీస్పూను; రోజ్ వాటర్ – టీస్పూను.

తయారీ: ● చిలగడ దుంప తొక్క తీసి ఉండలు లేకుండా మెత్తగా చిదుముకోవాలి ● చిదుముకున్న చిలగడ దుంప మిశ్రమంలో జీడిపప్పు పొడి వేసి కలపాలి ● పంచదారలో కొద్దిగా నీళ్లుపోసి సుగర్ సిరప్‌ను తయారు చేసుకోవాలి ● సిరప్ తయారయ్యాక కొబ్బరి తురుము వేసి కలుపుతూ ఉండాలి ● తీగ పాకం వచ్చినప్పుడు చిలగడదుంప మిశ్రమాన్ని వేసి కలపాలి ● మిశ్రమం దగ్గర పడుతున్నప్పుడు కొద్దిగా కొబ్బరిపాలు వేయాలి ● మధ్యలో కొబ్బరి పాలతోపాటు యాలకులపొడి, రోజ్ వాటర్ వేసి కలుపుతూ మొత్తం కొబ్బరి పాలు అయిపోయేంత వరకు మగ్గనివ్వాలి ● దాదాపు ఇరవై నిమిషాల తరువాత ఈ మిశ్రమం దగ్గర పడుతుంది. అప్పుడు స్టవ్ ఆపేసేయాలి ● గోరువెచ్చగా ఉన్నప్పుడే మిశ్రమాన్ని చేతులతోగానీ, మౌల్డ్స్‌లోవేసి నచ్చిన ఆకారంలో వత్తుకుంటే స్వీట్ సందేశ్ రెడీ.



కేసి మిథోయ్

కావలసినవి: తాజా బియ్యప్పిండి – రెండు కప్పులు; పచ్చికొబ్బరి తురుము – కప్పు; పంచదార పొడి – అరకప్పు; యాలకులపొడి అరటీస్పూను; కొబ్బరి నీళ్లు – అరకప్పు.

తయారీ: ● తడి బియ్యప్పిండిని ఒక గిన్నెలో వేసుకోవాలి ● దీనిలో కొబ్బరి తురుము, పంచదార పొడి, యాలకుల పొడి వేసి కలపాలి ● అవసరాన్ని బట్టి కొబ్బరి నీళ్లను కొద్ది కొద్దిగా వేసి పిండిని ముద్దలా కలుపుకోవాలి ● పిండి ముద్దను చిన్న భాగాలుగా చేసి, ఉండలుగా చుట్టుకోవాలి ● పిండి మొత్తాన్ని ఉండలుగా చుట్టుకుంటే కేసి మిథాయ్ రెడీ ● కొబ్బరి నీళ్లకు బదులు కొద్దిగా నెయ్యికూడా కలుపుకోవచ్చు ● రిఫ్రిజిరేటర్లో రెండుమూడురోజుల వరకు ఇవి తాజాగా ఉంటాయి.

న్యూస్‌మేకర్

ఆగొద్దు, పరుగు తీయండి


విత్య, నిత్య

'ముగ్గురు ఆడపిల్లల్ని కన్నావ్. ఎలా పెంచుతావో' అని ఆ తల్లికి దారిన పోయేవారంతా సానుభూతి తెలిపేవారు. పేదరికంతో అలమటిస్తున్న కుటుంబం అది. ఆ తల్లి తన కూతుళ్లను ఆపదలచలేదు, ఆగిపోనివ్వలేదు. 'ఫ్రీగా తిండి పెడతారు. తిని పరిగెత్తండి' అని ఇద్దర్ని తీసుకెళ్లి స్పోర్ట్స్ హాస్టల్‌లో పడేసింది. కవలలైన ఆ ఇద్దరు అక్కా చెల్లెళ్లు ఇవాళ భారతదేశంలో మేలైన అథ్లెట్లుగా మారారు. ఆసియన్ గేమ్స్‌కు క్వాలిఫై అయ్యారు. కోయంబత్తూరుకు చెందిన విత్య, నిత్యల పరుగు కథ ఇది.

అబ్బాయిలు పుడితేనేనా సంతోషం? అమ్మాయిలు పుడితే బాధపడాలా?

'నాకు లేని బాధ మీకెందుకు?' అని ఇరుగు పొరుగు వారితో అనేది మీనా.

కోయంబత్తూరులో నిరుపేదల కాలనీలో నివాసం ఉన్న మీనాకు మొదటి కాన్పులో ఆడపిల్ల పుట్టింది. 'సత్య' అనే పేరు పెట్టింది. రెండో కాన్పులో ఏకంగా కవల ఆడపిల్లలు పుట్టారు. వారికి 'విత్య', 'నిత్య' అనే పేర్లు పెట్టింది. భర్త రామరాజ్ లారీ డ్రైవరు. డ్యూటీ ఎక్కితేనే సంపాదన. ఇంట్లో ఎప్పుడూ పేదరికమే. దానికి తోడు 'ముగ్గురు ఆడపిల్లలు'! 'ఎలా పెంచుతావో ఏమో' అని ఇంటికొచ్చిన అందరూ అనేవారు. కాని మీనా అస్సలు బాధపడలేదు. భయపడలేదు. ఆడపిల్లలే కదా అని ఇంట్లో మగ్గేలా చేయలేదు. 'నా పిల్లలు చదువుకోవాలి. ఆడపిల్లలు పైకి రావాలంటే చదువే దారి' అని స్కూల్లో చేర్పించింది. పెద్దమ్మాయి సత్య చక్కగా చదువుకుంటే కవలలు విత్య, నిత్యలు స్కూల్లో హాకీ బాగా ఆడటం మొదలుపెట్టారు. కాని ఇంట్లో ప్రతి పూటా ఐదుగురికి ముద్ద నోట్లోకి వెళ్లాలంటే కష్టమైన సంగతి. స్కూల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ద్వారా స్పోర్ట్స్ స్కూల్ గురించి తెలిసింది. ఆ స్కూల్లో చేర్పిస్తే చదువుతోపాటు ఆటలు నేర్పిస్తారు అని తెలుసుకుంది మీనా. ఇద్దరు కూతుళ్ల చిన్న పిల్లలు. ఏడవ తరగతిలో ఉన్నారు. కళ్ల ముందు పెరగాల్సిన బిడ్డలు. 'ఏం పర్వా లేదు. మీ భవిష్యత్తే ముఖ్యం. స్పోర్ట్స్ స్కూల్లో కడుపు నిండా తిని బాగా పరిగెత్తండి' అని చెప్పి కవల సోదరీమణులైన విత్య, నిత్యలను కోయంబత్తూరులోని స్పోర్ట్స్ స్కూల్‌లో చేర్పించింది. ఆ తల్లి తపనను కూతుళ్లు అర్థం చేసుకున్నారు. బాగా ఆడారు. ఇవాళ విజేతలుగా నిలిచారు.

ఆసియా గేమ్స్ ఆశాకిరణాలు

మన దేశం నుంచి ఆసియా గేమ్స్‌లో పాల్గొన్న కవల క్రీడాకారులు తక్కువ. వారిలో మహిళా అథ్లెట్లు ఇంకా తక్కువ. మరో తొమ్మిది రోజుల్లో హాంగ్జవ్ (చైనా)లో మొదలుకానున్న ఆసియన్ గేమ్స్‌లో విత్య రామరాజ్, నిత్య రామరాజ్ పేర్లతో ఈ కవలలు పాల్గొనబోతున్నారు. విత్య 400 మీటర్ల హర్డిల్స్, ఫ్లాట్ రన్‌లో పాల్గొంటుంటే నిత్య 100 మీటర్ల పరుగులో పాల్గొననుంది. మన దేశం నుంచి మొత్తం 65 మంది ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్లు ఆసియా గేమ్స్ కోసం ఎంపికైతే వారిలో విత్య, నిత్య ఉన్నారు. 'ఇద్దరం ఎంపిక కావడంతో అమ్మ ఆనందానికి అవధులు లేవు. ఎవరో ఒకరు మాత్రమే అయితే ఆమె తప్పక బాధపడేది. ఆమె కోసం, దేశం కోసం ఎలాగైనా పతకాలు సాధించాలనే పట్టుదలతో ఉన్నాం' అన్నారు విత్య, నిత్య.

పి.టి. ఉషతో సమానంగా

విత్య రామరాజ్ చెన్నైలో శిక్షణ పొంది గత కొన్ని సంవత్సరాలుగా జాతీయ స్థాయి బంగారు పతకాలు గెలుస్తూ వచ్చింది. రెండ్రోజుల క్రితం చండీగఢ్‌లో జరిగిన గ్రాండ్‌ప్రీలో 400 మీటర్ల హర్డిల్స్‌ను 55.4 సెకెండ్లలో పూర్తి చేసింది. ఇది 1984 ఒలింపిక్స్‌లో పి.టి. ఉష రికార్డుకు కేవలం 0.01 సెకండ్ల కంటే తక్కువ. అంటే 39 సంవత్సరాల తర్వాత ఆ స్థాయి ప్రతిభను చూపే అథ్లెట్‌గా విత్య అవతరించింది. ఆనాడు ఆమె తల్లి ఆమెను ప్రోత్సహించకపోతే, ఆడపిల్లే అనుకుని ఖర్మకు వదిలిపెడితే ఈ రోజున ఇంత ప్రతిభతో నిలిచేదా? అలాగే నిత్య కూడా 100 మీటర్ల హర్డిల్స్‌లో మంచి ప్రతిభ చూపుతోంది. 'మేమిద్దరం ఆసియా గేమ్స్‌లో మెడల్స్ సాధించి ఒలింపిక్స్‌కు వెళ్లాలని అనుకుంటున్నాం. ఆశీర్వదించండి' అంటున్నారు విత్య, నిత్య.


తల్లి మీనాతో విత్య, నిత్య

ఇలాంటి క్రీడాకారిణులకు అందరి ఆశీస్సులూ ఉంటాయి.